టెక్నో సొల్యూషన్స్ మూడవ అంతస్తుపై ఉన్న రూఫ్ రెస్టారెంట్లో బాల్కనీ పిట్టగోడ పక్కనే వున్న కుర్చీలో ఆ రోజు సాయంత్రం కూర్చొని వున్నాడు కిషోర్ మూలపాటి. రోడ్డుకు అవతలి వైపు వున్న మైదానంలో క్రికెట్ ఆడుతున్న కుర్రాళ్లని చూసి బరువుగా నిట్టూర్చాడు. మైదానంలో కుర్రాళ్లు రోజూ క్రికెట్ ఆడుతుంటారు. ఏ రోజన్నా సాయంత్రం ఖాళీ దొరికితే వెళ్లి వాళ్లతో కాసేపు క్రికెట్ ఆడాలని అతని కోరిక. కానీ అది తీరడం లేదు. రోజూ సాయంత్రం స్నాక్స్ తీసుకునేటప్పుడు బాల్కనీ పిట్టగోడ దగ్గర కుర్చీలో కూర్చొని క్రికెట్ ఆడేవారిని చూస్తుంటాడు. ''ఎన్నాళ్లయ్యిందో క్రికెట్ ఆడి!'' అనుకున్నాడు స్వగతంగా. అతడి మనసులో చదువుకునే రోజులనాటి జ్ఞాపకాలు. ఇంతలో ''కమాన్ గైస్! వియ్ హావ్ వర్క్'' ప్రాజెక్ట్ మేనేజర్ పిలుపు. లేచి తన సెక్షన్ వైపు అడుగులు వేశాడు.

# సబ్‌ప్రైమ్

బి.వి.భద్ర గిరీష్

క్రికెట్ అతడికి ఆరోప్రాణంగా వుండేది. కాలేజీ రోజుల్లో అతను బ్యాటింగ్‌కి దిగితే, అవతలి జట్లు బౌలర్లు గడగడలాడేవారు. పరుగుల వర్షం కురిపించడంలో అతడు సిద్ధహస్తుడు. బ్యాట్‌తో అతడు చేసే విన్యాసాలు అద్భుతంగా వుండేవి. జిల్లా స్థాయి టీముకు సెలక్టయి, టోర్నమెంట్లు కూడా ఆడాడు. రంజీ సెలక్షన్‌కు ప్రయత్నించాడు. కొంత ప్రయత్నం తరువాత అంగబలం, అర్థబలం లేనిది రంజీ సెలక్షన్ సులభం కాదని అర్థమైంది. దానితో ఆ ప్రయత్నాలు విరమించుకోక తప్పలేదు.

ఈలోపుగా కుటుంబ బాధ్యతల వత్తిడి పెరిగింది. క్రికెట్ ఆటపై మక్కువ వున్నా, చదువును అశ్రద్ధ చేయకపోవడం అతడికి లాభించింది. డిగ్రీ తరువాత కొన్ని కంప్యూటర్ కోర్సులు చేయగానే... టెక్నో సొల్యూషన్స్‌లో ఒక సంవత్సర కాలానికి కాంట్రాక్టు ప్రాజెక్టు ఎనలిస్టుగా ఉద్యోగం దొరికింది. ఈ ప్రయత్నాలలో అతడి క్రికెట్ ఆట మూలపడింది.

అతడు పనిచేసే ప్రాజెక్టు అమెరికాలోని ఒక పెద్ద ఫైనాన్స్ కంపెనీవారు టెక్నోసొల్యూషన్స్‌కి ఇచ్చినది. సంవత్సర కాల పరిమితి గల ప్రాజెక్టు అది. జీతం అతడు ఊహించిన దానికన్నా ఎక్కువగానే వుంది. సంవత్సర కాలంలో పని తీరు బాగుంటే కంపెనీ పర్మినెంటుగా తీసుకుంటుందనే ఆశాభావం వుంది. టెక్నోసొల్యూషన్స్ కంపెనీకి ఈ విషయంలో ఇండస్ట్రీ వర్గాలలో మంచి పేరే వుంది.

అప్పటికి ఆరు నెలలైంది కిషోర్ కంపెనీలో చేరి. రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచీ రాత్రి తొమ్మిది గంటలదాకా డ్యూటీ వుంటోంది. ప్రాజెక్టు వ్యవధి సంవత్సర కాలమే కావడంతో పని వత్తిడి ఎక్కువగా వుంటోంది. దానికి తోడు ప్రాజెక్టు మేనేజరు చేసే వత్తిడి ఒకటి. అతడి ప్రమోషన్ ఈ ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి చేయడంపై ఆధారపడి వుంది మరి! ఉదయమే లేచి పనులు పూర్తి చేసుకొని, తొమ్మిది గంటలకల్లా ఆఫీసులో పడితే తిరిగి వెళ్లేది రాత్రి తొమ్మిది తరువాతే. అల్పాహారం, భోజనం, స్నాక్స్, కాఫీ, టీలు అన్నీ కంపెనీ రెస్టారెంట్లోనే. ఏవైనా స్వంత పనులు చేసి పెట్టడానికి కంపెనీలోనే ఒక విభాగం వుంది. త్రికరణ శుద్ధిగా సర్వకాల సర్వావస్థల యందు కంపెనీ అభివృద్ధికి ఉద్యోగులంతా అంకితమవ్వాలన్నది టెక్నోసొల్యూషన్స్ పాలసీ. దాన్ని ఆ విధంగానే కంపెనీ సాధించుకుంటూ వుంటుంది. క్రికెట్ ఆడడం మాట దేవుడెరుగు. టీవీలో మ్యాచ్ చూడడానికి కూడా వీలు కావడం లేదు కిషోర్‌కి.

మరో అయిదు నెలలు గడిచాయి. ప్రాజెక్టు కాల పరిమితి ఇంకొక నెలలో పూర్తవుతుందనగా, తమకు ప్రాజెక్టు ఇచ్చిన ఫైనాన్స్ కంపెనీ దివాళా

తీసిందనే వార్తను కొలీగ్స్ చెప్పుకోవడం విన్నాడు కిషోర్. అమెరికా ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్న సబ్‌ప్రైమ్ సంక్షోభంవల్ల ఆ ఫైనాన్స్ కంపెనీ తీవ్రంగా నష్టపోయి, దివాళా తీసిందట. ప్రాజెక్టు కొనసాగించేందుకుగానీ, ఇంత వరకూ చెల్లించాల్సిన బకాయిల చెల్లుబాటుకు గానీ వారి వద్ద డబ్బు లేదనీ, కొందరు కొలీగ్స్ తమ ఉద్యోగాలు పోతాయేమోనని అనుమానం వెలిబుచ్చారు. కిషోర్ మనసులో ఏమూలో నిబ్బరం. కొన్నేళ్ళ క్రితం సాఫ్ట్‌వేర్ పరిశ్రమ సంక్షోభంలో పడ్డప్పుడు కూడా టెక్నో సొల్యూషన్స్ సంస్థ సిబ్బందిని ఎవరినీ తీసేయలేదు. అది కొంత ధైర్యాన్నిస్తోంది.

ఆ రోజుపొద్దున ఆఫీసుకు రాగానే తమ ప్రాజెక్టు టీమ్ మెంబర్స్ అంతా ఒకచోట చేరి గందరగోళంగా చర్చించుకోవడం చూశాడు కిషోర్. కొందరి ముఖాల్లో ఆందోళన, కొందరి ముఖాల్లో విచారం, మరికొందరి ముఖాల్లో డిసప్పాయింట్‌మెంట్. సారాంశం ఏమిటంటే, కంపెనీ కాంట్రాక్టు ప్రాజెక్టు ఎనలిస్టులనందరినీ తొలగించింది. పొద్దునే ప్రాజెక్టు మెంబర్స్ అందరికీ మెయిల్ పంపించారు. గబగబా తన సీట్లోకి వెళ్ళి కంప్యూటర్లో మెయిల్ చెక్ చేశాడు. మొదటి మెయిల్ అదే!

''మీరు ఇంత వరకూ కంపెనీకి అందించిన సర్వీసులకు కృతజ్ఞతలు. ప్రాజెక్టు కొనసాగించే పరిస్థితి లేనందున, టర్మినేట్ చేయడం జరిగింది. అందుకు చింతిస్తున్నాం. బయట వేరే అవకాశాలు వెతుక్కోండి. మీకు శుభాకాంక్షలు. హెచ్ ఆర్ డిపార్ట్‌మెంట్లో మీ అకౌంట్ సెటిల్ చేసుకోగలరు.''

చేసేది లేక కాళ్ళీడ్చుకుంటూ అందరితో పాటు హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ వైపు కదిలాడు కిషోర్. తన అకౌంట్ సెటిల్ చేసుకుంటుంటే తెలిసింది. తమతో పాటు వేరే ప్రాజెక్టుల వారిని ఇంకొందరిని కూడా తీసేశారని, డాలరు మారకంలో రూపాయి విలువ పెరగడం వల్ల లాభదాయకత తగ్గడంతో, కంపెనీ మనుగడ కోసం కొందరిని తీసేశారు.

అకౌంట్ సెటిల్ చేసుకొని కంపెనీ నుంచి బయట పడ్డాడు కిషోర్. పుట్టని, పెరగని దేశానికి చెందిన ఆర్థిక వ్యవస్థపై నా జీవితం ఆధారపడడం ఏమిటో గొణుక్కున్నాడు. మధ్యాహ్నం అవుతోంది. రోడ్డ మీదికొచ్చాడు. మధ్యాహ్నం అయినా, దాదాపు పది మంది కుర్రాళ్ళు రెండు జట్లుగా విడిపోయి, ఎదురుగా వున్న మైదానంలో క్రికెట్ ఆడుతున్నారు. నెమ్మదిగా నడుచుకుంటూ వాళ్ళ దగ్గరకి వెళ్ళాడు. ''ఒక సారి బ్యాట్ ఇస్తావా భాయ్! నేను బ్యాటింగ్ చేస్త. రెండు వోవర్లు వెయ్!'' అతడి మాటల్లో పుట్టుకతో వచ్చిన యాస. ఉద్యోగంలో నేర్చుకున్న క్లాస్ ప్రవర్తన అతడికి ఇప్పుడు గుర్తుకురావడం లేదు. ఖరీదైన డ్రస్సు, బూట్లు వేసుకొని, టక్ చేసుకున్న యువకుడు తమ దగ్గరకొచ్చి బ్యాట్ అడగడం వాళ్ళకు వింతగా తోచింది. ఏమనుకున్నారో ఏమో, అతడి చేతికి బ్యాట్ ఇచ్చారు. ఒక కుర్రాడు బౌలింగ్ ప్రారంభించాడు. కిషోర్ చేతిలో బ్యాటు విన్యాసాలు ఆరంభించింది. బంతి ఎగిరెగిరి గ్రౌండ్ అవతల పడుతోంది. పరిగెత్తి వెళ్ళి తిరిగి బంతిని తెచ్చేసరికి కుర్రాళ్ళకు చెమటలు పడుతున్నాయి. బ్యాట్‌తో బంతిని బాదుతున్న కిషోర్ ముఖంలో కసి! అనుభవిస్తున్నది కోల్పోయినందుకా? లేక కోల్పోయింది తిరిగి అనుభవిస్తున్నందుకా?



*